## ఇటుక బట్టీలను తనిఖీ చేసిన న్యాయమూర్తి

కొత్తపల్లి/కోర్టుచౌరస్తా, మే 23 : జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి న్యాయమూర్తి కే వెంకటేశ్ బృందం శుక్రవారం చింతకుంట గ్రామంలోని ఎంఆర్‌బీ ఇటుక బట్టీలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ పనిచేస్తున్న కార్మికులకు అందుతున్న జీతభత్యాలతో పాటు వారి సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. వారికి అందుతున్న సౌకర్యాల గురించి ఆరా తీశారు. కార్మికుల హక్కులు కాపాడాలని బట్టీల యాజమాన్యానికి సూచించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి కే వెంకటేశ్ మాట్లాడుతూ, ఎలాంటి చట్టపరమైన సమస్యలు ఉన్నా కోర్టు ఆవరణలో ఉన్న న్యాయ సేవాధికార సంస్థను ఆశ్రయించి న్యాయ సహాయం పొందవచ్చని కార్మికులకు సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ రఫీ, లీగల్ ఏడ్ డిఫెన్స్ కౌన్సిల్ తణుకు మహేశ్ పాల్గొన్నారు.

## తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలి

కలెక్టరేట్, మే 23 : బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడనంతో జిల్లాలో కురుస్తున్న వర్షాలతో మార్కెట్ యార్డులు, కొనుగోలు కేంద్రాల్లోని వరి ధాన్యం పూర్తిగా తడిచిందని, ఆ ధాన్యాన్ని కూడా ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని, తెలంగాణ రైతుల ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని పద్మనగర్‌లో గల ఆసంఘం జిల్లా కార్యాలయంలో ద్వైవార్షిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికలకు ముందు కాంగ్రెస్ రైతులకిచ్చిన హామీలు విస్మరించి, పాలన సాగిస్తున్నదని విమర్శించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోగా, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా ముత్తినేని ఆగమరావు, ఉపాధ్యక్షులుగా కొంకటి శ్రీనివాస్, ఏల్పుల రాజేశం, ప్రధాన కార్యదర్శిగా వేముల వెంకటరెడ్డి, కోశాధికారిగా మంద లక్ష్మీనారాయణతో పాటు 20 మంది కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా సంఘం ఉద్యమాలు చేపట్టనున్నట్లు నూతన కార్యవర్గ ప్రతినిధులు ప్రకటించారు. ఉమ్మడి జిల్లాలోని వంద మందికి పైగా రైతు సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## నేడు ట్రినిటీలో క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్

కరీంనగర్ రూరల్, మే 23: బొమ్మకల్ బైపాస్‌లోని ట్రినిటీ ఇంజినీరింగ్ కళాశాలలో క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ బ్రోచర్‌ను శుక్రవారం కళాశాల వ్యవస్థాపకుడు దాసరి మనోహర్ రెడ్డి, కళాశాల చైర్మన్ దాసరి ప్రశాంత్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దాసరి మనోహర్ రెడ్డి మాట్లాడుతూ, తమ కళాశాలలో చదువుతున్న ప్రతి విద్యార్థికీ ఉద్యోగావకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో శనివారం ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు బహుళ జాతీయ కంపెనీలతో క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బీటెక్, ఎంబీఏ ఉత్తీర్ణులైన 2022, 2023-2024 విద్యార్థులతో పాటు ప్రస్తుతం చివరి సంవత్సరం చదువుతున్న వారు హాజరుకావచ్చని చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాగేంద్ర సింగ్, ఏవో రాజశేఖర్‌రెడ్డి, వైస్ ప్రినిపాల్ కిశోర్, ట్రైనింగ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ ప్రవీణ్‌కుమార్, హెచ్‌వోడీలు బలరాం, శ్రీధర్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు, రేపు కరీంనగర్‌లో తానాకాన్ 2025 సదస్సు

విద్యానగర్, మే 23 : నగరంలోని ప్రతిమ హోటల్‌లో తానాకాన్ 2025 డాక్టర్ల సదస్సు శని, ఆదివారాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుందని కార్యక్రమ నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సులో సమకాలీన అంశాలపై నిష్ణాతులైన వైద్య నిపుణులు పాల్గొని, చిన్న, మధ్య స్థాయి హాస్పిటల్ ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి 33 జిల్లాల నుంచి సుమారు 800 మంది డాక్టర్లు హాజరు కానున్నారని తెలిపారు.

## చెర్లభూత్కూర్‌లో కురుమ యువకుల ఆందోళన

కరీంనగర్ రూరల్, మే 23: చెర్లభూత్కూర్‌లో తాహెర్ కొండాపూర్ రోడ్డులోని ముదిరాజ్ భవనం సమీపంలో తక్కువ ఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద తెగిపడిన విద్యుత్ తీగలు తగిలి శుక్రవారం చిట్కూరి పోచాలుకు చెందిన గొర్రె షాక్‌కు గురై మృతి చెందింది. దీంతో ఆగ్రహించిన గ్రామ కురుమ యువకులు చనిపోయిన గొర్రెతో గ్రామంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట మొగ్దుంపూర్- నగునూర్ రహదారిపై ధర్నా చేశారు. వారంలో ఈ ప్రాంతంలో నాలుగు గొర్రెలు చనిపోయినా విద్యుత్ అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పరిహారం ఇప్పించేందుకు కృషి చేస్తానని ఏఈ నరేశ్ హామీ ఇచ్చినప్పటికీ వారు ధర్నా విరమించకపోవడంతో ఏడీఈ రఘు అక్కడికి చేరుకున్నారు. వెంటనే కాంట్రాక్టర్‌తో మాట్లాడి గద్దె నిర్మించి ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వడంతో యువకులు ఆందోళన విరమించారు. వెంటనే మృతిచెందిన గొర్రెలకు పరిహారం అందించాలని కోరారు.

## క్రెడిట్ నిర్ణయం విరమించుకోవాలి

కమాన్‌చౌరస్తా, మే 23 : రాష్ట్ర వ్యాప్తంగా డిగ్రీ కళాశాలల్లో ఆంగ్ల భాషకు కేటాయించిన 20 క్రెడిట్స్‌ను 12కు తగ్గించాలనే ప్రతిపాదన సరికాదని, ఈ నిర్ణయాన్ని రాష్ట్ర ఉన్నత విద్యామండలి విరమించుకోవాలని శాతవాహన విశ్వవిద్యాలయం ఆంగ్ల విభాగం అధ్యాపకులు విజ్ఞప్తి చేశారు. విభాగాధిపతి విజయప్రకాశ్, విశ్వవిద్యాలయ పరిధిలోని ఆంగ్ల అధ్యాపకులతో బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్‌పర్సన్ డాక్టర్ బీ దీపాజ్యోతి శుక్రవారం అత్యవసర ఆన్‌లైన్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఒకవైపు రాష్ట్రంలో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తూ డిగ్రీ విద్యార్థులకు వివిధ నైపుణ్యాలను నేర్పిస్తామంటూ, మరో పక్క ఆంగ్ల భాష ప్రాధాన్యత తగ్గించడం ఎంత వరకు సమంజసమో ఆలోచించాలన్నారు. సమావేశంలో ఎక్స్‌టర్నల్ మెంబర్ డాక్టర్ నిర్మల, విశ్వవిద్యాలయం పరిధిలోని వివిధ కళాశాలల ఆంగ్ల అధ్యాపకులు డాక్టర్ ఎస్ ఓదెలు కుమార్, తిరుపతి, డాక్టర్ దామోదర్, సుజిత, రాజ్, వెంకట్ సాయి తదితరులు తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు.

## నేడు రాజీవ్ యువ వికాసం అభ్యర్థులకు ఇంటర్వ్యూ

చిగురుమామిడి, మే 23: రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు శనివారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో మధుసూదన్ ఒక ప్రకటనలో తెలిపారు. గాగిరెడ్డిపల్లి, గునుకులపల్లి, కొండాపూర్, లంబాడి పల్లి, ముదిమాణిక్యం, ముల్కనూర్, ఒగులాపూర్, పీచుపల్లి, రామంచ, సీతారాంపూర్, ఉల్లంపల్లి గ్రామాలకు చెందిన దరఖాస్తుదారులు నిర్ణీత సమయానికి హాజరు కావాలని కోరారు.

## ఇందిరమ్మ ఇంటి కోసం మంత్రికి వృద్ధురాలి వినతి

కార్పొరేషన్, మే 23: తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని చిగురుమామిడి మండలం ఇందుర్తి గ్రామానికి చెందిన మంతెన వెంకటమ్మ అనే వృద్ధురాలు శుక్రవారం నగరంలో ఫిలింభవన్ వద్ద జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. తన ఇల్లు గతంలో వర్షాలకు కూలిపోయిందని, ఇందిరమ్మ కింద ఇల్లు మంజూరు చేయాలని కోరారు.

## మహిళలు అన్నిరంగాల్లోనూ రాణించాలి

జమ్మికుంట, మే 23: మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించాలని మెప్మా డీఎంసీ శ్రీవాణి అన్నారు. పట్టణంలోని నాయిని చెరువు వద్ద ఉమెన్ ఫర్ ట్రీస్ అమృత్ 2.0 సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మహిళా సంఘాల్లోని సభ్యులు వచ్చే వర్షాకాలంలో మొక్కలు నాటి జియో ట్యాగ్ ద్వారా వాటిని సంరక్షించాలన్నారు. మొక్కల సంరక్షణ బాధ్యత తీసుకోవాలన్నారు. మున్సిపల్ కమిషనర్ మహ్మద్ అయాజ్ మాట్లాడుతూ, రానున్న రోజుల్లో ఈ పథకం ద్వారా నాయిని చెరువును మినీ ట్యాంక్ బండ్‌గా మారుస్తామన్నారు. కార్యక్రమంలో మెప్మా ఇన్‌చార్జి టీఎంసీ జ్యోతి, సీఎల్ ఆర్పీ మంజుల, ఈఈ శ్రీకాంత్ పాల్గొన్నారు.

## కరాటే విద్యార్థులకు సన్మానం

హుజూరాబాద్ టౌన్, మే 23: పట్టణంలోని న్యూ కాకతీయ ఉన్నత పాఠశాలలో గ్లోబల్ షోటోకాన్ కరాటే డు అసోసియేషన్ జిల్లా శాఖ అధ్యక్షుడు ఎస్కే జలీల్ ఆధ్వర్యంలో బెల్ట్ మెరిట్ టెస్టులో ప్రతిభ చూపిన కరాటే విద్యార్థులను సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన హుజూరాబాద్ టౌన్ సీఐ టీ కరుణాకర్, తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చందుపట్ల జనార్ధన్ మాట్లాడుతూ.. కరాటే విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొండా గణేశ్, అంబేద్కర్ జయంతి ఉత్సవ కమిటీ మాజీ అధ్యక్షుడు ఖలీద్ హుస్సేన్, కరాటే అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు అంబాల ప్రభాకర్, కరాటే మాస్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

## అల్గునూరు పాదుపు సంఘం నూతన కార్యవర్గం

తిమ్మాపూర్/హౌసింగ్ బోర్డు కాలనీ, మే 23: తిమ్మాపూర్ మండలం అల్గునూరులోని శ్రీ ఆంజనేయ పురుషుల పొదుపు సహకార సంఘం 14వ వార్షిక మహాసభ శుక్రవారం నిర్వహించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చౌదరి పరశురాములు, ఉపాధ్యక్షుడిగా అగునూరి నరేశ్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే డైరెక్టర్లుగా గుడిపాటి లక్ష్మారెడ్డి, చిందం చంద్రయ్య, తమనవేణి ఓదెలు, సిరిసిల్ల పర్షయ్య ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా పరకాల ఎల్లయ్య వ్యవహరించారు. కార్యక్రమంలో పోరండ్ల సమితి అధ్యక్షుడు గుంటి వెంకటేశ్వర్లు, పలు గ్రామాల సంఘాల అధ్యక్షులు, సంఘం సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఈ-పాస్ ద్వారానే విత్తనాలు విక్రయించాలి

- నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు
- కలెక్టర్ పమేలా సత్పతి
- నగరంలో ఎరువుల దుకాణాల తనిఖీ

కరీంనగర్, మే 23 (నమస్తే తెలంగాణ): ఎలక్ట్రానిక్ పాయింట్ ఆఫ్ సేల్ మిషన్స్ ద్వారానే విత్తనాలు, ఎరువులు విక్రయించాలని కలెక్టర్ పమేలా సత్పతి స్పష్టం చేశారు. శుక్రవారం కరీంనగర్ గాంధీ రోడ్డులోని పలు ఎరువుల దుకాణాలు, గోదాములను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. విత్తన నిలువలు, అమ్మకాలకు సంబంధించిన వివరాలను డీలర్లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అన్ని ఎరువులు, విత్తనాలను గరిష్ఠ చిల్లర ధర ప్రకారమే విక్రయించాలని ఆదేశించారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని వ్యాపారులను హెచ్చరించారు. దుకాణాల్లో ఎరువులు, విత్తనాల ధరల బోర్డులు ప్రదర్శించాలని ఆదేశించారు. అవసరాన్ని బట్టి ఎరువులు నిల్వ చేసుకోవాలని రైతులకు సూచించారు. రైతులు ఎరువులు కొనేందుకు ఆధార్ కార్డును వెంట తెచ్చుకోవాలని, విత్తనాలు, ఎరువులు కొన్న తర్వాత తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలని, పంట పూర్తయ్యే వరకు ఈ బిల్లులు భద్రపర్చుకోవాలని సూచించారు. కలెక్టర్ వెంట కరీంనగర్ ఏడీఏ కే రణధీర్ కుమార్, కరీంనగర్ అర్బన్ ఏవో ఎం హరిత తదితరులు ఉన్నారు.


ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్

### భవిష్యత్ భారతానికి ప్రాథమిక విద్యే పునాది

కమాన్‌చౌరస్తా, మే 23: ప్రాథమిక విద్య దేశ భవిష్యత్తుకు పునాది అని, ఈ గురుతర బాధ్యతను గుర్తించి ఉపాధ్యాయులందరూ అంకిత భావం పనిచేయాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. పారమిత హెరిటేజ్ స్కూల్ కేంద్రంగా కొనసాగుతున్న గంగాధర మండల ప్రాథమిక ఉపాధ్యాయుల వృత్యంతర శిక్షణను నాలుగో రోజు కలెక్టర్ సందర్శించారు. ఉపాధ్యాయులు శిక్షణలో నేర్చుకున్న అంశాలన్నింటిని పాఠశాలలో అనుసరించాలని, నాణ్యమైన విద్యను అందిస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలని సూచించారు. ప్రాథమిక స్థాయి శిక్షణ మాడ్యూల్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా క్వాలిటీ కోఆర్డినేటర్ కర్ర అశోక్ రెడ్డి, కోర్స్ డైరెక్టర్, ఎంఈవో ఏనుగు ప్రభాకర్ రావు, పారమిత హెరిటేజ్ డైరెక్టర్ హనుమంతరావు, జిల్లా పరిశీలకుడు జేవీ శ్రీనివాస్, సంపత్, ఎమ్మార్పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మహిళా పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన సీపీ

కరీంనగర్, మే 23 (నమస్తే తెలంగాణ): కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం శుక్రవారం కరీంనగర్ మహిళా పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ సిబ్బందితో మాట్లాడి, రికార్డులను పరిశీలించి, వాటిని సక్రమంగా నిర్వహించాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న కేసులను సమీక్షించారు. వాటికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన వాటిని పూర్తి చేయాలని ఆదేశించారు. రానున్న లోక్ అదాలత్‌లో రాజీపడేందుకు వీలున్న కేసులను గుర్తించి వాటిని పూర్తి స్థాయిలో పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో టౌన్ ఏసీపీ వెంకటస్వామి, ఇన్‌స్పెక్టర్ శ్రీలతతో పాటు ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## మహిళను చంపుతానని బెదిరించిన ఒకరిపై కేసు

కరీంనగర్, మే 23 (నమస్తే తెలంగాణ)/కొత్తపల్లి: మహిళను చంపుతానని బెదిరించి, డబ్బులు లాక్కెళ్లిన గుర్తు తెలియని వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పరారీలో ఉన్న నిందితుడి కోసం పోలీసు ప్రత్యేక బృందం గాలిస్తున్నది. కొత్తపల్లి పోలీసు స్టేషన్ పరిధిలోని బద్దిపల్లి శివారులో జరిగిన ఈ ఘటనకు సంబంధించిన కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్ రెడ్డి, కొత్తపల్లి ఎస్ఐ సాంబమూర్తి తెలిపిన వివరాలు.. కొత్తపల్లి పోలీసు స్టేషన్ పరిధిలోని చింతకుంటకు చెందిన మాంకాళి మీన శుక్రవారం ఉదయం కమాన్‌పూర్ నుంచి కొండాపూర్‌లో జరుగుతున్న శుభకార్యానికి వెళ్తుండగా, బద్దిపల్లి శివారులో దోపిడీకి గురైంది. ఓ గుర్తు తెలియని వ్యక్తి చంపుతానని బెదిరించి ఆమె వద్ద ఉన్న రూ. 4 వేలు లాక్కున్నాడు. మీన వెంటనే కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు అక్కడికి చేరుకున్నారు. వారిని చూసి దొంగ పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కొత్తపల్లి పోలీసు స్టేషన్‌లో కేసు నమోదయింది. మహిళ వద్ద డబ్బులాక్కెళ్లిన గుర్తు తెలియని వ్యక్తి కోసం గాలిస్తున్నామని సీఐ నిరంజన్ రెడ్డి తెలిపారు. త్వరలో పట్టుకుని కోర్టులో హాజరుపరుస్తామని ఆయన స్పష్టం చేశారు.

## ఎన్‌కౌంటర్లపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరుపాలి

హుజూరాబాద్ టౌన్, మే 23: ఆపరేషన్ కగార్‌లో భాగంగా ఈ నెల 21న ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్లపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ప్రజా సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో ప్రజా సంఘాల నాయకులు, మానవ హక్కుల సంఘాల నాయకులు, మేధావులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మావోయిస్టు పార్టీ శాంతి చర్చలకు సిద్ధమని పలుమార్లు లేఖల ద్వారా విజ్ఞప్తి చేస్తున్నా.. ఎందుకు చర్చలు జరుపడం లేదని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు ముక్కెర రాజు, వేల్పుల రత్నం, తునికి సమ్మయ్య, పసుల స్వామి, సందెల వెంకన్న, అన్నాడి సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కిడ్నీ సమస్యలను నిర్లక్ష్యం చేయవద్దు

- యశోద హాస్పిటల్ నెఫ్రాలజిస్టు అరుణ్ కుమార్

విద్యానగర్, మే 23 : సైలెంట్ కిల్లర్‌గా మారుతున్న కిడ్నీ సమస్యలను నిర్లక్ష్యం చేయడం వల్ల డయాలసిస్ వరకు వెళ్లే ప్రమాదం ఉంటుందని సోమాజిగూడ యశోద హాస్పిటల్ నెఫ్రాలజిస్టు డాక్టర్ అరుణ్ కుమార్ పొన్న తెలిపారు. శుక్రవారం కరీంనగర్ యశోద మెడికల్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సిరిసిల్లకు చెందిన రాధ నొప్పులకు సంబంధించిన పేయిన్ కిల్లర్ ఇంజక్షన్ వేసుకోగా రెండు రోజుల తర్వాత జ్వరం వాంతులు ఎక్కువై యశోద హాస్పిటల్‌కు వచ్చిందన్నారు. వెంటనే పరీక్షలు నిర్వహించగా కిడ్నీ సీరం క్రియాటిన్ 6.0 ఉన్నట్లు తేలిందన్నారు. మరో రెండు రోజుల్లోనే క్రియాటిన్ 10.0కు చేరడంతో మూత్ర పిండాలు పనిచేయడం మానేశాయన్నారు. అయినప్పటికీ డయాలసిస్‌కు వెళ్లకుండా రోగ నిర్ధారణపై దృష్టిపెట్టి ఒక కిడ్నీ బయాప్సీ నిర్వహించినట్లు తెలిపారు. పేయిన్ కిల్లర్ ఇంజక్షన్ కారణంగా అలర్జీ వచ్చినట్లు గుర్తించామన్నారు. దీనికి తగిన విధంగా చికిత్స అందించడంతో పూర్తిగా కోలుకున్నదన్నారు. ఇలాంటి కేసులు కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో ఎక్కువగా వస్తున్నాయని తెలిపారు. సంవత్సరానికి ఒకసారి కిడ్నీ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. పేయిన్ కిల్లర్స్ విషయంలో జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. సమావేశంలో పేషెంట్ రాధ, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

## గుంతల మయం.. గుండెల్లో భయం


నగునూర్-వల్లంపహాడ్ రోడ్డు బ్రిడ్జిపై పడిన గుంతలు

నగునూర్ గ్రామ శివారులోని కరీంనగర్-రాయపట్నం ప్రధాన రహదారి అధ్వానంగా మారింది. ముఖ్యంగా నగునూర్-వల్లంపహాడ్ రోడ్డు బ్రిడ్జిపై భారీ గుంతలు ఏర్పడడం.. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాటిలో నీరు చేరడంతో తరచూ ప్రమాదాలు జరుగుతుండగా ప్రయాణికులు భయంభయంగా రాకపోకలు సాగిస్తున్నారు. పెను ప్రమాదం జరుగకముందే ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రత్యేక నిధులు కేటాయించి యుద్ధ ప్రతిపాదికన రహదారి మరమ్మతులు చేయించాలని వాహనదారులు కోరుతున్నారు.

*-కరీంనగర్ రూరల్, మే 23*

## ఉద్యోగోన్నతిపై ఏవో అబ్దుల్ ఖాదర్ బదిలీ

- సిరిసిల్ల మెడికల్ కళాశాలలో పోస్టింగ్

విద్యానగర్, మే 23 : కరీంనగర్ వైద్య ఆరోగ్య శాఖలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా పని చేస్తున్న అబ్దుల్ ఖాదర్‌కు అసిస్టెంట్ కమిషనర్‌గా ప్రమోషన్ కల్పించి సిరిసిల్ల ప్రభుత్వ మెడికల్ కళాశాలకు బదిలీ చేశారు. అబ్దుల్ ఖాదర్‌కు ఉద్యోగోన్నతి లభించిన సందర్భంగా వైద్య, ఆరోగ్య శాఖ ఉద్యోగులు, హెచ్-1 సంఘం రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ ఎన్ శ్రీనివాస్ కర్ణ, రాష్ట్ర జాయింట్ జనరల్ సెక్రటరీ అఫ్తాబ్ అహ్మద్‌ఖాన్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా వైద్య విధాన పరిషత్ హాస్పిటల్స్ ప్రెసిడెంట్ టీ రవీందర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీ చంద్రమౌళి, బ్లడ్ బ్యాంక్ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ రఫీ, సిరిసిల్ల జిల్లా యూనియన్ నాయకులు ఎండీ అజీజ్, బీ జనార్ధన్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

## 'ఆటో ఆకలి కేకలు' సభకు తరలిరావాలి

తెలంగాణచౌక్, మే 23: కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను అమలు చేయాలనే డిమాండ్‌తో ఈ నెల 27న హైదరాబాద్‌లో ఆటోడ్రైవర్ల జేఏసీ ఆధ్వర్యంలో తలపెట్టిన 'ఆటో ఆకలి కేకలు' భారీ సభను విజయవంతం చేయాలని కరీంనగర్ ఆటో కార్మిక సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దెల రాజేందర్ పిలుపునిచ్చారు. నగరంలోని సంఘం కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ, ఈ సభకు ఉమ్మడి జిల్లానుంచి అధిక సంఖ్యలో ఆటో డ్రైవర్లు తరలిరావాలని కోరారు.

## ఆలయ నిర్మాణానికి విరాళాలు

హౌసింగ్ బోర్డు కాలనీ, మే 23: నగరంలోని 8వ డివిజన్ అల్గునూర్ శ్రీ లక్ష్మీగణపతి ఆలయ నిర్మాణానికి ఏఎన్ఆర్ ఉన్నతి ఫంక్షన్ హాల్ బాధ్యులు అన్నాడి అరుణ, మోహన్ రెడ్డి దంపతులు శుక్రవారం లక్షా నూటాపదహారు రూపాయలు విరాళంగా ఆలయ ట్రస్టు బాధ్యులకు చెక్కు ద్వారా అందజేశారు. అలాగే ఆళ్ల శోభ, నర్సింహారెడ్డి దంపతులు రూ.10,116 విరాళం ఇచ్చారు.

## నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

వీణవంక, మే 23: ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ట్రైనీ ఎస్ఐ సాయికృష్ణ హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రంలో వ్యవసాయాధికారితో కలిసి స్థానిక విత్తనాలు, ఎరువుల విక్రయాల షాపుల యజమానులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నకిలీ విత్తనాలు అమ్మకూడదని, లైసెన్స్ ఉన్నవారే అమ్మకాలు జరుపాలని, తదితర సూచనలు చేశారు. కార్యక్రమంలో ఫర్టిలైజర్ షాప్‌ల యజమానులు, తదితరులు పాల్గొన్నారు.

## దరఖాస్తుల ఆహ్వానం

కొత్తపల్లి, మే 23: తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ 2025-26 విద్యా సంవత్సరానికి గానూ ప్రాంతీయ క్రీడా హాస్టల్స్‌లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని జిల్లా యువజన క్రీడాశాఖాధికారి వి. శ్రీనివాస్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండలోని ప్రాంతీయ క్రీడా హాస్టల్‌లో ప్రవేశాలకు జూన్ 10, 11న, ఖమ్మంలోని అథ్లెటిక్స్ అకాడమీకి జూన్ 12, సైక్లింగ్, రెజ్లింగ్ అకాడమీ-సైక్లింగ్ వెలోడ్రోమ్, ఓయూలో జూన్ 10, 11, వనపర్తిలోని హాకీ అకాడమీలో జూన్ 12, వాలీబాల్ అకాడమీ సరూర్‌నగర్, రాజన్న సిరిసిల్లలో జూన్ 10న, సిద్దిపేటలోని వాలీబాల్ అకాడమీలో జూన్ 1న, మహబూబ్‌నగర్‌లోని వాలీబాల్ అకాడమీలో జూన్ 12, 13వ తేదీల్లో ఎంపిక పోటీలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఈ ఎంపిక పోటీల్లో పాల్గొనే విద్యార్థులు జనన ధ్రువీకరణ పత్రం, సంబంధిత సర్టిఫికెట్‌లతో నిర్ణీత తేదీల్లో పోటీలు జరిగే స్టేడియాల్లో రిపోర్ట్ చేయాలని తెలిపారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముకరంపుర, మే 23: ఇంటర్ లింకింగ్, పాడైన విద్యుత్ స్తంభాలు మార్చడం, విద్యుత్ తీగల కింద ఉన్న చెట్ల కొమ్మలు తొలగించే పనులు చేపడుతున్నందున శనివారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు టౌన్-1, కరీంనగర్ రూరల్ ఏడీఈలు పంజాల శ్రీనివాస్ గౌడ్, రఘువేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. ఉదయం 10నుంచి మధ్యాహ్నం12గంటల వరకు ముగ్దుంపూర్, ఇరుకుల్ల, నల్లగుంటపల్లె, చెర్లభూత్కూర్, చామనపల్లి, దుబ్బపల్లి, ఫకీరుపేట్, జూబ్లీనగర్, బహదూర్ ఖాన్ పేట్, తాహెర్ కొండాపూర్, ఎలబోతారం, ఉదయం 9.30నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు చింతకుంటలో కొంత ప్రాంతం, కమాన్ పూర్‌లో కొంత భాగం, గ్రానైట్ ఇండస్ట్రీస్, మధ్యాహ్నం 3నుంచి సాయంత్రం 4గంటల వరకు ఫారెస్ట్ ఆఫీసు, జైల్ పెట్రోల్ పంప్, సీపీ ఆఫీసు, కరీంనగర్ క్లబ్, వేంకటేశ్వర టెంపుల్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

తిమ్మాపూర్, మే 23: మండలంలోని అలుగునూర్ సబ్ స్టేషన్ పరిధిలో గల అల్గునూరు, ఎల్ఎండీ, మహాత్మానగర్, తిమ్మాపూర్ గ్రామంలోని పలు కాలనీల్లో విద్యుత్ లైన్ల మరమ్మతుల నేపథ్యంలో శనివారం ఉదయం 9.30 నుంచి 11.30 వరకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని ఏఈ ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.

## డిగ్రీ ఫలితాల విడుదల

కమాన్‌చౌరస్తా, మే 23 : శాతవాహన యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ మొదటి, రెండో, మూడో సంవత్సరం పరీక్షలు ఫిబ్రవరిలో నిర్వహించగా, ఫలితాలు విడుదల చేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ సురేశ్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థులు ఫలితాల కోసం http://103.119.113.107:86, www.satavahana.ac.in సందర్శించవచ్చని తెలిపారు.

## ఏడుగురిపై మాల్ ప్రాక్టీస్ కేసు

కమాన్‌చౌరస్తా, మే 23: శాతవాహన యూనివర్సిటీ పరిధిలో జరుగుతున్న డిగ్రీ పరీక్షల్లో మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడిన ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ సురేశ్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో కరీంనగర్‌లోని అపూర్వ డిగ్రీ కళాశాలలో ఇద్దరు, కిమ్స్‌లో ఒకరు, పెద్దపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇద్దరు, హుజూరాబాద్ వాగ్దేవి డిగ్రీ కళాశాలలో ఒకరు, జమ్మికుంట చాణక్య డిగ్రీ కళాశాలలో ఒకరు మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడుతూ పట్టుబడ్డట్లు వివరించారు.

## సిరిసేడులో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు'

ఇల్లందకుంట, మే 23: మండలంలోని సిరిసేడు రైతు వేదికలో శుక్రవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సమావేశానికి హాజరైన జిల్లా వ్యవసాయాధికారి భాగ్యలక్ష్మి, పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. శాస్త్రవేత్త శ్రీనివాసరావు ఎరువుల వాడకం, యూరియా వాడకం, సాగునీటి ఆదా, పచ్చిరొట్ట ఎరువులపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు, ఏవో సూర్యనారాయణ, ఏఈవోలు మమత, రాకేశ్, హార్టికల్చర్ అధికారి మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

## నీతి, నిజాయితీకి మారు పేరు నరెడ్ల శ్రీనివాస్ : మంత్రి పొన్నం


ఫిలిం భవన్‌లో శ్రీనివాస్ విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి పొన్నం ప్రభాకర్

కమాన్‌చౌరస్తా, మే 23 : నీతి, నిజాయితీ, మంచి తనానికి మారు పేరు నరెడ్ల శ్రీనివాస్ అని, లోక్ సత్తా ఉద్యమ నాయకుడిగా, సామాన్యులు, వినియోగదారుల పక్షాన ఆయన పోరాటం మరువలేనిదని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ కొనియాడారు. శుక్రవారం నరెడ్ల శ్రీనివాస్ విగ్రహాన్ని కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఫిలిం భవన్‌లో కలెక్టర్ పమేలా సత్పతి, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్, కరీంనగర్ ఫిలిం సొసైటీ అధ్యక్షుడు పొన్నం రవిచంద్ర, రాష్ట్ర గురుకులాల సంయుక్త కార్యదర్శి శ్యాంప్రసాద్‌లాల్, శ్రీనివాస్ భార్య మధుమతి, కుటుంబ సభ్యులతో కలిసి మంత్రి ఆవిష్కరించారు. అనంతరం సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను 1987లో ఎస్సారార్ డిగ్రీ కాలేజీలో డిగ్రీ పూర్తి చేసిన తర్వాత శ్రీనివాస్‌తో ఏర్పడిన పరిచయం తన రాజకీయ ఎదుగుదలకు ఎంతో దోహద పడిందని గుర్తు చేసుకున్నారు. ఫిలిం సొసైటీకి మంచి స్థలం సేకరిస్తే, భవన నిర్మాణానికి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వరాల మహేశ్, ప్రశాశ్ హోల్లా, ఆర్‌వీ రావు, కోల రామచంద్రారెడ్డి, సయ్యద్ ముజఫర్, అన్నవరం దేవేందర్, డాక్టర్ రఘురాం, ఎన్ శ్రీనివాస్, లోక్‌సత్తా, వినియోగదారుల మండలి సభ్యులు, అభిమానులు పాల్గొన్నారు.

## ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలుపరుస్తాం


లబ్ధిదారుకు ఇందిరమ్మ ఇల్లు ప్రొసీడింగ్ కాపీ అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్యనారాయణ

శంకరపట్నం, మే 23: ప్రజలకు ఇచ్చిన అన్ని హామీలను తప్పకుండా అమలుపరుస్తామని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం తాడికల్, ఆముదాలపల్లి, కేశవపట్నం గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు భూమి పూజ నిర్వహించి, ప్రొసీడింగ్స్ పత్రాలు అందజేసి మాట్లాడారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో 32 మంది లబ్ధిదారులకు 7 లక్షల 13 వేల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో ఎంపీడీవో కృష్ణప్రసాద్, తహసీల్దార్ సురేఖ, పీడీ గంగాధర్, డీఈ వెంకటరమణ, ఏఈ మహమూద్ అలీ, ఎంపీవో ప్రభాకర్, మాజీ జడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బసవయ్య, నాయకులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ హయాంలోనే ఆలయాల అభివృద్ధి


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సతీశ్ కుమార్

చిగురుమామిడి, మే 23: బీఆర్ఎస్ అధికారంలో ఉన్న కాలంలోనే ఆలయాలు ఎంతో అభివృద్ధి చెందాయని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితల సతీశ్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో శ్రీ స్వయంభూ పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, చిగురుమామిడి పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయం ప్రముఖ పుణ్యక్షేత్రంగా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పంచముఖ ఆంజనేయ స్వామి విగ్రహ దాత బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడు ఆకవరం శివప్రసాద్‌ను అభినందించారు. ఇక్కడ జిల్లా నాయకుడు కొత్త శ్రీనివాస్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ జంగా వెంకటరమణారెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మామిడి అంజయ్య, మాజీ అధ్యక్షుడు కృష్ణమాచారి, మాజీ ఎంపీపీ ఆకవరం భవాని, నాయకులు పాల్గొన్నారు. పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయాన్ని సీపీఐ జాతీయ నేత, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి సందర్శించారు.

## ఎల్ఐసీ అధికారి మృతికి సంతాపం

విద్యానగర్, మే 23 : ఎల్ఐసీ కరీంనగర్ డివిజన్ సారథి, సీనియర్ డివిజనల్ మేనేజర్ జాక్వెలిన్ అబ్రహం తంజావూరు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి గురువారం ఉదయం హాస్పిటల్‌లో మృతిచెందగా, మార్కెటింగ్ మేనేజర్ సోమశేఖర రావు ఒక ప్రకటనలో సంతాపం ప్రకటించారు. డివిజనల్ మేనేజర్ నారాయణ, ఇతర అధికారులు, యూనియన్ నాయకులు సిబ్బంది దివంగత అధికారికి ఘనంగా నివాళులర్పించారు.

## మాజీ సర్పంచుల కుటుంబాలను ఆదుకోండి

శంకరపట్నం, మే 23: ఎస్ఎఫ్‌సీ గ్రాంట్ విడుదల చేసి మాజీ సర్పంచుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని అర్కండ్ల మాజీ సర్పంచ్ చేర్ల అనిత విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఆమె మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్ రాఘవేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం అనిత మాట్లాడుతూ, గతంలో తాము బాధ్యతాయుతంగా అప్పులు తెచ్చి గ్రామాలను అభివృద్ధి చేశామని తెలిపారు. ఇప్పుడు తమను పట్టించుకునేవారు కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే గ్రాంట్ విడుదల చేయాలని కోరారు.

## పొదుపు సంఘం అధ్యక్షుడిగా రవీందర్‌గౌడ్

సైదాపూర్, మే 23: సైదాపూర్ పురుషుల పొదుపు సంఘం అధ్యక్షుడిగా పైడిపల్లి రవీందర్‌గౌడ్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా కోడెం సురేశ్, నూతన పాలకవర్గ సభ్యులుగా పోలోజు నర్సింహాచారి, ఖమ్మం రమేశ్, వేముల కిశోర్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రవీందర్‌గౌడ్ మాట్లాడుతూ, సంఘం పటిష్టానికి పాటుపడతామన్నారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు అనగోని పరశురాములు, దొనికెన మారుతి, అనగోని శ్రీనివాస్, బొంగోని రమేశ్, పైడిపల్లి రమేశ్, భూపెల్లి యశ్వంత్, సమితి గణకుడు అనగోని వీరన్న, సంఘం గణకుడు ముజ్జిగ రామకృష్ణ పాల్గొన్నారు.

## సంఘం అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి

తెలంగాణచౌక్ , మే 23: తెలంగాణ నాయీబ్రాహ్మణ సేవా సంఘం అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తానని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు నీలం మొండయ్య స్పష్టం చేశారు. నగరంలోని వావిలాలపల్లి రోడ్ గల సంఘ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన జిల్లా కమిటీ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నాయీబ్రాహ్మణుల సమస్యలను స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ సహకారంతో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. సంఘం బలోపేతం కోసం మండలాల్లో సమావేశాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జంపాల సంపత్, నాయకులు వెంకటేశ్. రాజు, సదానందం పాల్గొన్నారు.

## సీపీఐ జిల్లా మహాసభను జయప్రదం చేయాలి

తెలంగాణచౌక్, మే 23: భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా 23 మహాసభను జయప్రదం చేయాలని ఆ పార్టీ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. నగరంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం నగర కమిటీ సభ్యులతో కలిసి మహాసభకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఈ నెల 27, 28 తేదీల్లో మధు గార్డెన్‌లో నిర్వహిస్తున్న పార్టీ జిల్లా మహాసభలో అధిక సంఖ్యలో పార్టీ కార్యకర్తలు పాల్గొనాలని కోరారు. సమావేశంలో నాయకులు రాజు, పద్మ, సత్యం, సంపత్ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

LOST
★ Regula Kanakaraju S/o Bhoomaiah, V/o. Nampalle, Anupur, Vemulawada mandal, Rajanna Siricilla Dist. my passport No. E1662116 lost by travelling, any one found please call me. 6300662510.
NTK-000

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189